ప్రజాశక్తి

శనివారం 20 మే 2023

5

శ్రీ సత్యసాయి



ముగిసిన ఎపి ఇఎపి సెట్

2,24,724 మంది హాజరు : జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్దన

అనంతపురం : జెఎన్‌టియు, ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపి ఇఎపి సెట్-23 ఎట్టకేలకూ శుక్రవారం ముగిశాయి. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలు విజయవంతంగా ముగిసినట్లు ఛైర్మన్ రంగజనార్ధన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో 2,38,180 మంది పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోగా తొమ్మిది సెషన్స్‌లో జరిగిన పరీక్షలకు 2,24,724 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. దీంతో 94.35 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. ఇందుకోసం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 136 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆఖరి రోజు శుక్రవారం ఉదయం 25,121 మంది హాజరుకావాల్సి ఉండగా 23,975 మంది హాజరైనట్లు తెలిపారు.

ఉపాధిపై కత్తి..!

2004లో వామపక్షాల ఆధ్వర్యంలో కూలీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి కుట్ర చేస్తోంది. నిబంధనల పేరుతో పనిదినాలు, కూలీల సంఖ్యను తగ్గించే కుట్ర చేస్తోంది. రాష్ట్రంలో మిగతా జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధి హామీ కూలీల కడుపునింపుతోంది. గ్రామాల్లో ఈ పనులు చేసుకుంటూ కూలీలు కుటుంబ జీవనాన్ని సాగిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఉపాధిపై కేంద్ర ప్రభుత్వం నిబంధనల కత్తిని వేలాడదీస్తోంది. కొత్తకొత్త నిబంధనలు, మార్పులు, షరతులు తీసుకొచ్చి క్షేత్రస్థాయిలో కూలీలను ముప్పతిప్పలు పెడుతున్నారు. జిల్లాలో అమలు జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనితీరును పరిశీలించేందుకు 'ప్రజాశక్తి' శుక్రవారం నాడు చిలమత్తూరు మండలం వీరాపురం గ్రామంలో పర్యటించింది. ఈ గ్రామంలో కూలీలు తమ సమస్యలను తెలియజేశారు.



- నిబంధనల పేరుతో నిర్వీర్యం చేసే కుట్ర
- కూలీల కడుపుకొట్టేలా కేంద్రం నిర్ణయాలు
- బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం
- పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించని వైనం

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు రోజువారి పనిని బట్టి రోజుకు రూ.272 కూలి ఇవ్వాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఇది రూ.150 లోపే పడుతోంది. ఆన్‌లైన్ మస్టర్ ఫీడింగ్, హాజరు నమోదులో లోపాలు టెక్నికల్ సమస్యలు ఇలా అనేక కారణాల చేత గతంలో కన్నా పని అధికం చేసినా కూలి మాత్రం తక్కువగా పడుతోంది. దీనికితోడు పని చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు అందని పరిస్థితి నెలకొంది. చేసిన పనులకు పేస్లిప్‌లు ఉండవు. రాష్ట్ర వ్యాప్తంగా 6 వారాలకి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుంది. ఉపాధి హామీ అమలుపై ప్రభుత్వాలకు ఎలాంటి చిత్తశుద్ధి ఉందో తెలుస్తోంది.

ఆన్‌లైన్ మస్టర్‌తో అవస్థలు

ఉపాధిలో నూతనంగా అవలంబిస్తున్న విధానాల్లో భాగంగా ఆన్‌లైన్ మస్టర్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని వల్ల కూలీలు పూర్తిగా నష్టపోతున్నారు. సాధారణంగా ఉపాధి పనులను చెరువు, కుంటలు, అటవీ ప్రాంత సరిహద్దులు, కొండలు గుట్టల్లో కల్పిస్తారు. అలాంటి ప్రదేశాల్లో ఫోన్‌లకు నెట్‌వర్క్ వచ్చే అవకాశాలు చాలా తక్కువ ఉంటాయి. ఇలాంటి ప్రదేశాల్లో ఆన్‌లైన్ కూలీల హాజరు వేయడం చాలా కష్టంగా ఉంటోంది. ఆన్‌లైన్ హాజరు వేయకపోతే కూలీకి ఆ రోజు కూలి పోయినట్లే. దీనికితోడు రోజుకు రెండు పూట్ల పని చేయాలనే నిబంధన కూడా కూలీలను ఇబ్బందులపాలుజేస్తోంది. చేసిన పనులకు సంబంధించి కొలతల ఆధారంగా కూలి ఇస్తారు. ఒక వేళ ఈ కొలతలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ కాకపోతే కూలీలు పని చేసినా కూలి డబ్బులు వారి ఖాతాల్లో జమకావు.

కనీస సౌకర్యాలు కానరావు

పని చేసే ప్రదేశంలో ఉపాధి కూలీలకు కల్పించే కనీస సౌకర్యాలు మచ్చుకైన కన్పించవు. పనులు జరుగుతున్న ఏ ప్రాంతంలో పరిశీలించినా సౌకర్యాల లేమి కన్పిస్తుంది. పనిచేసే చోట మంచినీళ్ల, మజ్జిగ, ప్రథమ చికిత్స కిట్లు, టెంట్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆచరణలో ఇవి అమలుకావడం లేదు. ఇక పనిముట్లు ఎప్పుడిచ్చారో కూడా తెలియని పరిస్థితినుంది. ఉపాధికి సంబంధించి పనిముట్లు ఇస్తారన్న సంగతి కూడా కూలీలకు తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉపాధి ప్రారంభంలో మంచినీళ్లకు రూ.5, ఉపాధి పని ప్రదేశం 5కి॥మీ॥ దాటితో రానుపోను ఛార్జీలు, గునపం సానకు డబ్బులను ప్రభుత్వం ఇచ్చేది. కొత్త విధానాలు అమల్లోకి వచ్చాక వీటిన్నంటినీ ప్రభుత్వం రద్దు చేసింది.



వీరాపురం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

'ఉపాధి'తోనే జీవనం



నాకు 73 సంవత్సరాలు. కుటుంబ జీవనం గడవాలంటే కూలి పనులు చేసుకోవాల్సిందే. గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనులు తనలాంటి వారికి ఎంతో ఉపయోగంగా ఉంటాయి. అయితే రానురాను ఉపాధిలో చాలా మార్పులు వస్తున్నాయి. ఈ పథకం ప్రారంభంలో ఉన్నన్ని సదుపాయాలు ఇప్పుడు లేవు. పనుల కల్పన, కూలి చెల్లింపు, వసతులు ఇలా అన్నింటిలోనూ ప్రభుత్వాల నిర్లక్ష్యం కన్పిస్తోంది. మండుటెండలో చేతులకు బొబ్బులు వచ్చేలా పని చేసినా కూలి మాత్రం నామమాత్రంగానే వస్తోంది. కొత్తకొత్త నిబంధనలు చెప్పి కూలీలను గందరగోళానికి గురి చేస్తున్నారు. ఇటీవల చేసిన పనులకు కూలి సక్రమంగా పడటం లేదు. గతంలో మా ఉపాధి సంఘంలో వందమంది ఉండేవారం.. ఇప్పుడు 20కు తగ్గిపోయింది. ప్రభుత్వ నిర్ణయాలే ఇందుకు కారణం.

బావన్న, లక్ష్మీపురం,
చిలమత్తూరు మండలం.

బిల్లులు ఇవ్వకుంటే ఎలా..?



ఏడు వారాల నుంచి ఉపాధి పనులు చేస్తున్నాం. ఇందులో ఒక్క వారం బిల్లు మాత్రమే వచ్చింది. కూలీ కూడా చాల తక్కువ వచ్చింది. 7 రోజులు పనికి 900లే వచ్చింది. ఈ లెక్కన రోజుకు 120 రూపాయలే వచ్చింది. ఇందులో 6 వారాల బిల్లులు పడలేదు. గ్రామంలో ప్రస్తుతం ఎక్కడా వ్యవసాయ పనులు లేవు. ఓవైపు ఉపాధి బిల్లులు ఇవ్వక, మరోవైపు గ్రామంలో ఇతర వ్యవసాయ పనులు లేకపోతే తాము ఎలా జీవించాలి. పనులు కూడా అరకొరగానే కల్పిస్తున్నారు. చేసిన పనులకూ బిల్లులు ఇవ్వడం లేదు. గతంలో మాదిరగా కాకుండా ఆన్‌లైన్ పేరుతో అన్నింట్లోనూ కోతలు పెడుతున్నారు. ఆన్‌లైన్ విషయాలు తమకేమీ తెలియవు. ఏదైనా అధికారులకు చెబితే అంతా ఆన్‌లైన్ అంటూ సమాధానం ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతి వారం బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలి.

భాగ్యమ్మ, వీరాపురం,
చిలమత్తూరు మండలం.

ఉపాధి నిర్వీర్యానికి కుట్ర

గ్రామాల్లో కూలీలకు ఎంతో బాసటగా ఉపాధి హామీ చట్టం నిలుస్తోంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఉపాధిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. కొత్తగా తీసుకొచ్చిన విధానాలు, షరతుల కారణంగా క్షేత్రస్థాయిలో పేదలు ఉపాధి దూరం అయ్యే ప్రమాదం ఏర్పడింది. గ్రామాల్లో పనులు లేక కుటుంబ పోషణ నిమిత్తం కూలీలు వలసల బాట పడుతున్నారు. ఉపాధిపై కేంద్రం తీసుకుకుంటున్న నిర్ణయాలు పూర్తిగా కూలీలను ఇబ్బందిపాలుజేసేలా ఉన్నాయి. కూలీలకు రక్షణగా ఉండాల్సిన ఉపాధిని కనుమరుగు చేసే కుట్రను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తోంది. దీనిని వ్యవసాయకార్మిక సంఘంగా ఖండిస్తున్నాం. ఉపాధి రక్షణ నిమిత్తం కూలీలకు అండగా పోరాటం సాగిస్తాం. అందులో భాగంగా ఈ నెల 22వ తేదీన శ్రీసత్యసాయి కలెక్టరేట్ వద్ద కూలీలతో కలిసి మహాధర్నాను నిర్వహిస్తాం. కేంద్ర ప్రభుత్వానికి బుద్ధిచెప్పి, ఉపాధిని రక్షించుకునేందుకు జరిగే ఈ పోరాటంలో కూలీలు పాల్గొని విజయంతం చేయాలి.

పి.ప్రవీణ్‌కుమార్,
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు.

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

◆ ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులు ◆ కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి



వాలంటీర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు లబ్ధి చేకూరస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాడు విజయవాడ నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని పర్చువల్ విధానంలో నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8263 మందికి సేవమిత్ర, 193 మందికి సేవారత్న, 34 మంది సేవ వజ్ర కింద ఎన్నికయ్యారని చెప్పారు. అవినీతి, వివక్షకు తావు లేకుండా సేవలు అందిస్తున్న వాలంటీర్ల సేవలు గుర్తించి ప్రభుత్వం ప్రోత్సాహకంగా అవార్డులు అందిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు వాలంటర్లు చేస్తున్న సేవలు గొప్పవన్నారు. వరుసగా మూడోసారి అవార్డులు ప్రధానం చేయడం సంతోషకరమన్నారు. వాలంటీర్లు అవార్డులు అందుకుని మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం సేవా వజ్రకు ఎంపికైన వాలంటీర్లు 34 మందికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు ఒక్కొక్కరికి 30 వేల రూపాయలు అందజేశారు. సేవారత్న కింద జిల్లాలో ఎంపికైన 193 మందికి సర్టిఫికెట్, శాలువా, మెడల్‌తో పాటు 20 వేల రూపాయలు, సేవా మిత్ర కింద ఎంపికైన వారికి 10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు, సచివాలయాల కోఆర్డినేటర్ హిమవాణి, ఆయా శాఖల అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

కలెక్టర్ అరుణ్ బాబు, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే చిరుధాన్యాల వంటలను వినియోగించాలని కలెక్టర్ అరుణ్ బాబు, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని సాయిఆరామంలో డిఆర్‌డిఎ, వైకెపి ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ఎమ్మెల్యేలతో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల రుచి చూశారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలకు ఒకప్పుడు మన దేశం పుట్టినిల్లులా ఉండేదన్నారు. పోషక విలువలున్న రాగి, సజ్జ, జొన్న, కొర్రలు తినడం ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. చిరుధాన్యాల సాగుకు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాగి, సజ్జ, జొన్న తదితర పోషక విలువలు ఉన్న వంటలను మర్చిపోతున్నారన్నారు. పోషక విలువలు లేని తిండి తింటున్నందునే శరీరం చచ్చు పడిపోతూ అనేక రోగాలు తెచ్చుకుంటున్నారన్నారు. చిరుధాన్యాలు వాడితే డాక్టరు అవసరం ఉండదన్నారు. జిల్లాలో 60 వేల చిరుధాన్యాలు సాగు చేస్తున్నారని ఆ సాగు లక్ష ఎకరాలకు విస్తరించే విధంగా అధికారులు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రి బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, రెడ్స్ సంస్థ భానుజా, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, పౌర సరఫరాల శాఖ డిఎం అశ్వర్థనారాయణ నాయక్, ఐసిడిఎస్ పీడీ లక్ష్మికుమారి, సిరికల్చర్ జెడి పద్మమ్మ, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, జిల్లా సమైక్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, శాస్త్రవేత్త శ్రీనివాస్, ప్రకతి వ్యవసాయం లక్ష్మి నాయక్ పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం



కదిరిలో సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు



పెనుకొండలో నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలారామాంజినేయలు, సిపిఎం పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న పేర్కొన్నారు. స్థానిక కళాజ్యోతి సర్కిల్లో అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం సుందరయ్య 38వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పార్టీ అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. సంపన్నకుటుంబంలో జన్మించిన ఆయన పేదల కోసం తన ఆస్తిని కూడా పంచిపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, రైతుసంఘం జిల్లా నాయకులు మారుతి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, నాయకులు హరి, వెంకటస్వామి, సుబ్రమణ్యం, కుళాయప్ప, కేశవనాయుడు, ముస్తాఫా, శేఖర్, శ్రీరాములు, వెంకటేశ్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : మండల కేంద్రంలో సుందరయ్య కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు రమణ, సి ఐ టి యు మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, ట్రాన్స్‌పోర్టు రంగం జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ప్రజల కోసం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : భూస్వామ్య కుటుంబంలో జన్మించినా కార్మికుల కర్షకుల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సిపిఎం జిల్లా నాయకులు బడా సుబ్బిరెడ్డి, పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సిపిఎం కార్యాలయం వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుందరయ్య తన చివరి శ్వాస వరకు పీడిత ప్రజల కార్మికుల, కర్షకుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అయిన సుందరయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు.

పెనుకొండ: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు హరి మాట్లాడుతూ సుందరయ్య 1964 నుంచి 1976 వరకు సిపిఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి లక్ష్య సాధనకు కషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, తిప్పన్న, వజ్రం నాగప్ప, చిన్న వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల కార్యదర్శి రాజగోపాల్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ధనిక కుటుంబంలో జన్మించిన సుందరయ్య పేద ప్రజల కోసం ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు చాంద్‌బాషా, మాబు, వెంకటేశులు, గంగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, చేనేత కార్మిక సంఘం మండల కమిటీ నాయకులు రామాంజనేయులు, గోవిందప్ప, ఆంజనేయులు, భవన నిర్మాణ సంఘం మండల నాయకులు కె.రవి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పెనుకొండ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎర్రమంచి పంచాయతీ కురుబవాండ్లపల్లి గ్రామంలో శుక్రవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సర్పంచి నాగమూర్తి, వైస్ ఎంపిపి రామాంజనేయులు, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఏకరువు పెట్టగా వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకప్ప, ఎంపిపి గీతా రామ్మోహన్ రెడ్డి, జడ్పిటిసి శ్రీరాములు, వైసిపి మండల కన్వీనర్ బాబు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-సోమందేపల్లి

వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘం రెండు బృందాలుగా ఏర్పడి శుక్రవారం మండల పరిధిలో పలుచోట్ల జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అందులో భాగంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, మండల అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో రంగేపల్లిలో, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, మండల కార్యదర్శి రాజగోపాల్ ఆధ్వర్యంలో చాల కూరులో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ సక్రమంగా బిల్లులు చెల్లించడం లేదని, రోజుకు రూ. 275 వేతనం చెల్లించాల్సి ఉండగా రూ. 160 నుంచి రూ. 180 చెల్లిస్తున్నారని, పని ప్రదేశాల్లో నీరు, నీడ, మజ్జిగ, తదితర సౌకర్యాలు కల్పించలేదని, గడ్డపా రకు అదనపు వేతనం చెల్లించడం లేదని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల సంరక్షణ, హక్కుల సాధనకై ఈ నెల 22వ తేదీ కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాలో కూలీలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కూలీలకు అందజేశా రు. కార్యక్రమంలో నాయకులు కొండా వెంకటేష్, శీలా నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ ముట్టడి

రొద్దం: మోడీ ప్రభుత్వం మోసాలను ఎండగట్టడానికి ఈ నెల 22వ తేదీ కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చామని, అందులో ఉపాధి, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.గంగాధర్ కోరారు. మండల పరిధిలోని కంచి సముద్రం, లోచర్ల గ్రామాల ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నారాయణ, లోచర్ల, కంచి సముద్రం కూలీలు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అదనపు పనిదినాలు కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి బుక్కపట్నం

ఉపాధి పథకంలో అదనపు పనిదినాలు కల్పించాలని ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని ఉపాధి కూలీలు కోరారు. మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి, లింగప్ప గారి పల్లి గ్రామాలలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి పనుల తీరుతెన్నులు, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. రోజుకు 600 రూపాయలు వేతనం వచ్చేలా చూడాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవి అలవెన్సును రద్దు చేశారని వాపోయారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి కూలీలను హింస పెడుతున్నారని వాపోయారు. ఉపాధి హామీ చట్టం తమకు ఎంతో ఊరటను ఇస్తోందని ఈ పథకాన్ని కూడా ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడానికి పూనుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూలీల పైన ఉందని అందుకోసం పోరాటాల్లోకి కలిసి రావాలని పిలుపునిచ్చారు. 22న కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు మహాధర్నాకు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ , ఉపాధి హామీ కూలీలు అక్కులప్ప, ఎర్రదొడ్డి, అంజనేయులు, నాగభూషణ, నీలమ్మ, రమాదేవి, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కరువు



ప్రతిరోజూ దాదాపు 5,6 కిలోమీటర్లు నడిచి వెళ్లి పనులు చేస్తున్నాం. ఎండాకాలంలో ఎండలు విపరీతంగా ఉన్నప్పటికీ పనులు చేసే చోట సరైన సౌకర్యాలు కల్పించలేదు. ఎండ వేడిమికి తట్టుకొని పనులు చేస్తున్నాం. దీంతో పలువురు అనారోగ్యం పాలవుతున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలి.

నరసమ్మ ఉపాధి హామీ కూలి, బుక్కపట్నం

అలవెన్సులు ఇవ్వడం లేదు



పనులు జరుగుతున్న ప్రదేశంలో నీటి వసతి లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీల రేట్లు పెంచడం లేదు. పైగా పనులు కూడా తగ్గిస్తున్నారు. అలవెన్సు కూడా కల్పించడం లేదు. ఇలాగైతే కూలీలు వలసలు పోక తప్పదు.

సరోజమ్మ, ఉపాధి హామీ కూలి

నేరాలు ఘోరాలు

గడ్డివామి దగ్ధం

సోమందేపల్లి : మండల పరిధిలోని ఈదుల బలాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆదినారాయణరెడ్డి గడ్డివామికి గురువారం అర్ధరాత్రి దుండగులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలి బూడిదైంది. బాధితుడి వివరాల మేరకు.. రాజకీయ కక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు 10 ట్రాక్టర్ల గడ్డివామికి నిప్పు పెట్టారని, అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విషయం తెలియడంతో వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జడ్పిటిసి డిసి అశోక్, ఉప సర్పంచి వేణు, ఎల్లారెడ్డి, నాయకులు వెంకటరత్నం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యర్థులు రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ ఇలాంటి చర్యలకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇలాంటి వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

గోరంట్ల: ఇటీవల నమోదైన గుర్తుతెలియని మృతదేహం కేసులో నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. సిఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బుడ్డపల్లి వద్ద ఈ నెల 4వ తేదీ గుర్తుతెలియని శవాన్ని గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టి మృతుడు హిందూపురం పట్టణానికి చెందిన ఇలియాజ్‌గా గుర్తించారు. ఇలియాజ్ ఎరుకల మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని వేధిస్తుండడంతో అతని హత్యకు హిందూపురం పట్టణానికి చెందిన ఎరుకల మహేంద్ర, అతని బావమర్ది ప్రదీప్‌కుమార్, సాయి వినయ్ కలిసి పథకం వేశారు. అందులో భాగంగా ఈ నెల 4వ తేదీ వారు ముగ్గురూ ఇలియాజ్‌కు మద్యం తాపి హత్య చేశారు. అనంతరం శవాన్ని కారులో తీసుకొచ్చి మండల పరిధిలోని బుడ్డపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన కల్వర్టు కింద వేసి వెళ్లారు. ఇలియాజ్‌పై 60కి పైగా చోరీ కేసులు ఉన్నట్లు సిఐ తెలిపారు. నిందితులను హిందూపురం శివారులో అరెస్టు చేసి వారి నుంచి మారుతి కారు, రెండు ద్విచక్ర వాహనాలు, కత్తి స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలకు వినతి

కదిరి టౌన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు భార్య భువనేశ్వరి కుటుంబ సభ్యుల వ్యక్తిత్వం దెబ్బ తినే విధంగా అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి స్థానిక నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు వారు శుక్రవారం పట్టణంలోనీ డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి వైసిపి సోషల్ మీడియాలో భూషణ గారి సూరశేఖర్ రెడ్డి మరికొందరు ,మహిళలను అవమాన పరిచే విధంగా ఫోటో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, హిందూపురం పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు బాబ్జాన్, హిందూపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు మోపూరిశెట్టి చంద్రశేఖర్, 24 వ వార్డు కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా, హిందూపురం పార్లమెంట్ నాయకులు మనోహర్ నాయుడు, మాజీ ఉమెన్ కమిషన్ మెంబర్ పర్వీన్ భాను, గాండ్లపెంట మండల కన్వీనర్ కొండయ్య, తనకల్ మండల కన్వీనర్ తొట్లపల్లి రాజశేఖర్ రెడ్డి, నాయకులు కావడి ప్రవీణ్, రాజశేఖర్ బాబు, విజయ్ ప్రకాష్ తదితరులు పాల్గన్నారు.

వీధిపేరు మార్పునకు వ్యతిరేకంగా నిరసన

హిందూపురం : పురపాలక సంఘంలోని ముక్కిడిపేటలో వీధి పేరు మార్చడానికి జరుగుతున్న ప్రయత్నాలపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలను నిరసిస్తు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హిందూపురం ప్రశాంతంగా ఉందని, అయితే కొంత మంది ముక్కిడి పేటలో ఒక వీధి పేరుని ముబారక్ మసీదు వీధిగా మార్చాలని ప్రయత్నిస్తున్నారన్నారు. వీధి పేర్లను యధావిధిగా కొనసాగించాలన్నారు. పేరు మార్చడం ద్వారా ప్రశాంతంగా ఉన్న హిందూపురంలో కొత్త సమస్యలు మొదలవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎ రమేష్ రెడ్డి, మేడికుర్తి హరి, భాగ్యలక్ష్మి గౌడ్, అమర్ దేవేంద్ర, నగేష్, శ్రీరాములు, శకుంతలమ్మ, ముక్కిడి పేట వాసులు సునీల్, టిఎన్ మణికంఠ, మారుతి, రాజు, మంజు, రాజా, నాగ, విజయ్ బాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించండి

కొత్తచెరువు : శ్రీ సత్య సాయి జిల్లాలో ఈనెల 20వ తేదీన నిర్వహించే ఎపిఆర్‌జెఇ, ఎపిఆర్ఎస్ ఎంట్రన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిఇఒ కార్యాలయం ఎడి నాగరాజు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పుట్టపర్తిలో 7, ధర్మవరంలో 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు భోజన సౌకర్యం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల రోగులకు వారి సహాయకులకు (500 మంది) భోజనపు ప్యాకెట్లను వైద్యులు, నర్సుల చేతుల మీదుగా శ్రీ సత్య సాయి సేవ సమితి సేవాదళ్ సభ్యులు శుక్రవారం అందజేశారు. ఇందులో భాగంగానే గర్భిణీలకు ప్రత్యేకంగా స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మలతతో పాటు వైద్యులు శ్రీ సత్యసాయి సేవా సమితి వారికి రోగుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 17 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

డైట్ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం : ఉమ్మడి జిల్లాలోని అసక్తి, అర్హత గల విద్యార్థులు డైట్‌సెట్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భూసేకరణ సమ్మతం కాదు : హైకోర్టు స్టే

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కదిరిగేటు వద్దగల ఉపరితల వంతెన నిర్మాణం కోసం అధికారులు చేపట్టిన భూసేకరణ సమ్మతంగా లేదని బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు స్పందించి స్టే ఆర్డర్‌ను మంజూరు చేసింది. దీంతో ఆ ఆర్డర్ కాపీని ఆర్డీవో కార్యాలయ ఏవో ఖుద్రాకు శుక్రవారం అందజేశామని బాదితులు రాము, నాగరాజు, ప్రభాకర్, లక్ష్మీనారాయణరెడ్డి, మనోహర్, నాగార్జున, నాగరాజు, మల్లికార్జున తెలిపారు. ఉపరితల వంతెన నిర్మాణం కోసం తమ ఇళ్లు పూర్తిగా సేకరించారని, కానీ చట్టవిరుద్ధంగా ఏకపక్షంగా న్యాయసూత్రాలు ఉల్లంఘించి భూసేకరణ చేశారని హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీంతో కోర్టు స్టే ఇచ్చిందని బాదితులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలి

హిందూపురం : సచివాలయాల పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి సక్రమంగా అందించేలా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సచివాలయ ఉద్యోగులకు ఆదేశించారు. శుక్రవారం హిందూపురం పురపాలక సంఘంలోని శ్రీకంఠపురం 8వ వార్డు సచివాలయం, మేళాపురం 34వ వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ తనఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నాడు - నేడు పనులు వేగవంతం : కలెక్టర్


ప్రజాశక్తి బత్తలపల్లి

నాడునేడు పథకం కింద పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. శుక్రవారం తాడిమర్రి మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయాన్ని, మండలంలోని పిన్నదరి గ్రామం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నాడు - నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్‌తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల పనులు పూర్తికాగా, మిగిలిన అన్ని రకాల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ తాడిమర్రి విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2023 -24 సంవత్సరానికి సంబంధించి వచ్చిన టెస్ట్‌బుక్‌లను పరిశీలించి స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, ఎంఇఒ కృష్ణమోహన్, తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ విజయలక్ష్మి, పిఆర్ ఎఇ, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎస్టీ కమిషన్ పరామర్శ

ప్రజాశక్తి అమడుగూరు

కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో గిరిజన మహిళపై అసభ్యంగా ప్రవర్తించి కులం పేరుతో దూషించిన ఎస్ఐ హేమంత్ కుమార్ పై బాధిత గిరిజన కుటుంబ సభ్యులు ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ తదితరులు శుక్రవారం బాధిత రాధాబాయి కుటుంబాన్ని పరామర్శించి విచారణ చేపట్టారు . ముదిగుబ్బ ఎస్ఐ హేమంత్ కుమార్ ఓ కేసులో విచారించేందుకు రాత్రి సమయంలో రాధాబాయి ఇంట్లోకి ప్రవేశించి రాధాబాయ్ తో పాటు ఆమె కూతురు మనిషాను కులం పేరుతో దూషించి మనిషా పట్ల అసభ్యంగా ప్రవర్తించారని బాధితులు కమిషన్ సభ్యులకు వివరించారు. టిడిపి కార్యకర్త కలాం, ఎస్ఐ హేమంత్ కుమార్, మరో ఇద్దరు కానిస్టేబుళ్ల తమ ఇంటికి వచ్చి తమపై దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించి అసభ్యంగా ప్రవర్తించారని ఎస్టీ కమిషన్ ఎదుట రాధాబాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ హేమంత్ కుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని అన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయాలని అక్కడే ఉన్న కదిరి డీఎస్పీ శ్రీలతకు కమిషన్ సభ్యులు సూచించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ హామీ ఇచ్చారు.



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యులు

తహశీల్దార్ కార్యాలయం ముట్టడి



తహశీల్దార్ కార్యాలయం ముందు రైతుల నిరసన

దంపెట్ల ఇసుక రీచ్ అనుమతులు రద్దు చేయాలంటూ నిరసన
రీచ్ వద్ద టిప్పర్ల అడ్డగింత

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని దంపెట్ల-ఉప్పర్లపల్లి సమీపాన చిత్రావతి నదిలో నూతనంగా అనుమతులిచ్చిన ఇసుక రీచ్‌ను రద్దు చేయాలంటూ మండలంలోని పలు గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు, సిపిఐ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతాలైన ఉప్పర్లపల్లి, దంపెట్ల గ్రామాలకు చెందిన రైతులు సమస్యను శుక్రవారం స్థానిక తహశీల్దార్ యుగేశ్వరిదేవి దృష్టికి తీసుకెళ్లడానికి వచ్చారు. అయితే తహశీల్దార్ కలెక్టరేట్లో సమావేశానికి వెళ్లినట్లు తెలుసుకున్న సర్పంచు, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో కార్యాలయం మెట్లపై కూర్చుని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో వందలాదిమంది ఫిల్టర్ బావులతో వ్యవసాయాన్ని సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. ప్రభుత్వం ఇసుకరీచులకు అనుమతులు ఇవ్వడంతో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి కూడా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం దంపెట్ల వద్ద ఇసుక రీచ్‌కు ప్రతిపాదనలు మాత్రమే చేసిందని అనుమతులు కూడా రాకమునుపే టిప్పర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, కనీసం పంచాయతీ అనుమతులు కూడా తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం రెవిన్యూ అధికారులకు కూడా తెలియక పోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో సిఎస్‌డిటి శారదకు రైతులు వినతిపత్రం అందజేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దారు యుగేశ్వరిదేవి సర్పంచితోనూ, రెవెన్యూ సిబ్బందితోను మాట్లాడి ఇసుక రీచ్ ను నిలుపుదల చేయాలంటూ వీఆర్వో నరసింహులు, విఆర్ఎను ఆదేశించారు. రైతులు ఈసందర్భంగా అధికారులతో కలిసివెల్లి ఇసుక రీచ్ వద్ద టిప్పర్లను అడ్డుకున్నారు.

నేడు చేనేత సమస్యలపై ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారంకోసం ఏపీ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీవోకార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు, చేనేతసంఘం నాయకులు వెంకటస్వామి, సూరి, వేణు, రాజు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒకప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో గతంలో 150లక్షల మగ్గాలు ఉండేవని, పాలకుల విధానాల వల్ల, అధికారుల అలసత్వం వల్ల క్రమక్రమంగా తగ్గుతూ వచ్చాయన్నారు. 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేయకపోవడమే ఇందుకు కారణమన్నారు 11 రకాలను పవర్ లూమ్స్ లో నేయడం వల్ల నేతన్నలు రోడ్డున పడ్డారన్నారు. పవర్ లూమ్స్ పై చేనేత 11రకాలను నేయరాదని ఉద్యమాలు చేపట్టామన్నారు. పవర్లూమ్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ హ్యాండ్లూమ్స్ అధికారులను కోరామన్నారు. అధికారులు పవర్లూమ్స్ మగ్గాలపై దాడులు నిర్వహిస్తున్నారని, అయినా పవర్‌లూమ్స్‌లో చేనేత రకాలను నేస్తూనే ఉన్నారని విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ ధర్నాకు చేనేతకార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

కదిరిలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి ఆమడగూరు

ఎండాకాలం అంటే కొంతవరకు ఎండలు ఉండడం సహజం. కానీ ఈ మధ్యకాలంలో నిప్పులు చెరిగే ఎండలు ఉండడంతో ప్రజలు తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక పట్టణాల్లోని ప్రజలు అధిక ఉష్ణోగ్రతతో తీవ్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలికి పోతే గాని పూట గడవనిపరిస్థితిలో ఉన్న కొంతమంది కూలీలు పనుల సమయంలో ఎండ వేడికి తట్టుకోలేక అనారోగ్యాలకు గురవుతున్నారు. కదిరి పట్టణం లో 12 గంటలు దాటిందంటే ఎండ వేడికి తట్టుకోలేక చిరు వ్యాపారులు, ఇతర పనుల మీద వచ్చిన గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా నిలువ నీడ లేకుండా ఉన్న చెట్లను కూడా నరికి వేయడంతో దుకాణాల ముందర నిలబడితే యాజమాన్లు బెదిరింపుతో తరిమేస్తుండటంతో ప్రజలు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. పట్టణంలో మధ్యాహ్నం సమయంలో ఎండకు తట్టుకోలేక దుకాణాలు మూసివేశారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులు కూడా తీవ్రస్థాయిలో ఉక్కపోతకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి ఆందోళన కరంగా ఉంటోంది. ఇక ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న రోగుల పరిస్థితి మరింత అయోమయంగా మారింది. శుక్రవారం కదిరి పట్టణంలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మృతుని కుటుంబానికి పరామర్శ

కొత్తచెరువు : మండల పరిధిలోని తలమర్ల పంచాయతీలోని ఇళ్ల వెంకటం పల్లి గ్రామానికి చెందిన డీలర్ హనుమంత రెడ్డి ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. దీంతో మృతుని భార్య లక్ష్మీదేవిని, కుటుంబ సభ్యులను పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. పార్టీ తరపున కుటుంబాన్ని ఆదుకుంటామని ప్రభుత్వపరంగా రావాల్సిన వాటిని త్వరితగతిన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి, నాయకులు రెడ్డప్ప రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్:శ్రీ సత్య సాయి జిల్లాలో పోలీస్ స్టేషన్లను అధికారుల, విశ్రాంతి భవనాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ,పోలీస్ గెస్ట్ హౌస్, పోలీస్ క్వార్టర్స్, దిశ స్టేషన్, పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టేషనులకు వచ్చు ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించి వారికి తగిన న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కెవి. రామకృష్ణప్రసాద్, దిశ డీఎస్పీ కెవిఎన్ వరప్రసాద్, ఎఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటాన్, పుట్టపర్తి అర్బన్ సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, అర్బన్ ఎస్ఐ వీరేష్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ చంద్రశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోండి

పరిగి : పరిగి మండలం కాలువ పల్లి గ్రామంలో విద్యుత్ అధికారుల జరిమానాతో ఒత్తిడి గురై మృతిచెందిన రైతు, ఇటుక బట్టి వ్యాపారి బీరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం పరిగి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ నరసింహకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకని ఎఎస్ఐ జయలలితకు సమస్యను వివరించారు. రైతు బీరయ్య మృతికి కారకులైన మనోహర్‌చ సిద్ధ రాజ్‌చ ముద్ద గంగప్పచ హరిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాలుపల్లికి చెందిన 15 మంది రైతులకు విధించిన అధిక జరిమానాను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేయాలని విద్యుత్ అధికారి నిజాముద్దీన్ కోరారు. ఈ కార్యక్రమంలో కాలవపల్లి శ్రీనివాసులు, కిష్టప్ప, హనుమంతప్ప, చౌడయ్య, చక్రపాణి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా నాగరాజు

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా ఎనుముల పల్లి కి చెందిన నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో గల దుర్గమ్మ గుడి వద్ద నాయి బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో పేద నాయి బ్రాహ్మణులకు, విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని తీర్మానించారు. అలాగే సంక్షేమ సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఒక సొసైటీ ఉండాలని తీర్మానించి సొసైటీ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షునిగా ఎనుములపల్లికి చెందిన నాగరాజును ఎన్నుకున్నారు. సొసైటీ ద్వారా నాయి బ్రాహ్మణులలోని పేద విద్యార్థులకు తమ వంతు సహాయం చేయాలని నిర్ణయించారు. ఈసందర్భంగా సొసైటీ అధ్యక్షులు నాగరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, గోరంట్ల, ధర్మవరం, కదిరి మండలాలకు చెందిన నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆణిముత్యం’కు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని

హిందూపురం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థిని షాజియా ప్రభుత్వం ప్రకటించిన జగనన్న ఆణిముత్యంకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ మురళి మోహన్ తెలిపారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతు 2023లో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో కళాశాలలో సిఇసి చదువుతున్న విద్యార్థిని షాజియా వెయ్యి మార్కులకు 962 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. దీంతో జగనన్న ఆణిముత్యం పథకానికి ఎంపిక అయిందని అన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరారు. 2023- 24 విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాలలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఈసి గ్రూపులలో ఉచిత విద్య కొరకు ప్రవేశం పొందగోరు విద్యార్థులు నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, మండల విద్యాశాఖ అధికారి,సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదించాలని కోరారు.

క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికే మెగా క్రికెట్ టోర్నీ



ధర్మవరంలో క్రీడాకారులు, నాయకులతో పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి బత్తలపల్లి

క్రీడల పట్ల యువతను ప్రోత్సహించడానికే రాప్తాడు-ధర్మవరం సూపర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును నిర్వహిస్తున్నట్లు టిడిపి అధికార ప్రతినిధి, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాప్తాడు-ధర్మవరం సూపర్ లీగ్ (ఆర్‌డిఎస్ఎల్) మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను పరిటాల శ్రీరామ్ తో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడా పోటీలను ప్రారంభించారు. మొదటగా పరిటాల శ్రీరామ్ బ్యాటింగ్ చేయగా గోనుగుంట్ల విజయ్ కుమార్ బౌలింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ టోర్నమెంట్ కు సుమారు 30 జట్లు ఎంట్రీ ఫీజు చెల్లించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి సురేంద్రనాయుడు, ధర్మవరం నియోజకవర్గం ఆర్‌టిఎస్ కోఆర్డినేటర్ బోయపాటి అప్పస్వామి నాయుడు, గంటాపురం జగ్గ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని శుక్రవారం ప్రారంభించినట్లు రామగిరి మండల టోర్నమెంట్ ఆర్గనైజర్ ఎల్ శ్రీధర్ నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బడమద్దుల రంగయ్య, రామ్మూర్తి నాయుడు, పరంధామ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గుర్రం శీన, పేపర్ శీన తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాప్తాడు, ధర్మవరం క్రికెట్ సూపర్ లీగ్ టోర్నీని నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ శుక్రవారం ప్రారంభించారు.. ముందుగా పరిటాలరవీంద్ర చిత్రపటానికి హలమాల వేసి నివాళులర్పించారు అనంతరం ఇరుజట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దఢత్వాన్ని ఇస్తాయన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన తాగునీరు మజ్జిగ,అల్పాహారం పామియానాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల విజయకుమార్, కమతంకాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్చార్జ్ చింతలపల్లి మహేశ్ చౌదరి, నాయకులు ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, రాంపురంశీన, గంగారపురవి, కేశగాళ్ల శ్రీనివాసులు, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, ఓంప్రకాశ్, చిన్నూరు విజయ్ చౌదరి, తోటవాసుదేవ తదితరులు పాల్గొన్నారు.

రాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
H.M.O.P.13/2023
Between:
యర్రమనేని అంజినప్ప S/o వెంకటరమణ, డోర్‌నెం.14-67, బండకాడపల్లి, H/o కొర్తికోట, తనకల్లు మండలం, శ్రీసత్యసాయి జిల్లా. ...పిటీషనర్
V/s
యర్రమనేని శ్రీదేవి ...రెస్పాండెంట్
To,
యర్రమనేని శ్రీదేవి W/o అంజినప్ప, D/o కొర్లచంద్రప్ప, డోర్‌నెం.12-22, తోదేండ్లగడ్డపల్లి, H/o కొర్తికోట, తనకల్లు మండలం, శ్రీసత్యసాయి జిల్లా.
రెస్పాండెంట్‌కు నోటీసు
పై అర్జీలోని పిటీషనరుకు భార్య అయిన యర్రమనేని శ్రీదేవి మీద పై కోర్టులో విడాకులకు అర్జీ వేసి వున్నారు. పై కోర్టు అర్జీ రెస్పాండెంటు అయిన నీ హాజరు నిమిత్తమై 15-06-2023 వ తేదికి వాయిదా వేయబడి వున్నది. రెస్పాండెంటు అయిన నీవు స్వతహాగా గానీ, వకీలు ద్వారా గానీ, హాజరు అయి ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలయునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టువారి ఆదేశాల మేరకు)
వాయిదా తేది:15-06-2023.
వై.రవీంద్ర
అర్జీదారుతరపు వకీలు, కదిరి.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి ముజీబ్, డి.నాగరాజు

కోర్టు ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో జుగాడ్ సిస్టం ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ముఖ్య అతిథులు జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కక్షి దారులు, న్యాయవాదులు, సిబ్బంది తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ఆర్వో వాటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విక్రాంతనాయక్, న్యాయవాదు లు లక్ష్మీనారాయణ, దయానందరెడ్డి, నాగిరెడ్డి, జావిద్, మోహన్‌నాయక్, శ్రీనివాసులు, కోమలి, హరీష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'పరిటాల ట్రస్ట్' ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

కనగానపల్లి: మండల పరిధిలోని ముత్తవకుంట్ల గ్రామంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను శుక్రవారం సర్పంచి రామాంజనేయులు, ఎంపిటిసి శ్రీరాములు ప్రారంభించారు. మొదటి రోజు మామిళ్లపల్లి–దాదులూరు, కనగానపల్లి–పాతపాలెం, కోనాపురం– ముత్తవకుంట్లతండా జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశులు, మండల కన్వీనర్ పోతలయ్య, బట్టా సురేష్ చౌదరి, పథకమూరి అంజి, ఎంపిటిసి బిల్లే భాస్కర్, శ్రీరాములు, రాజాకృష్ణ, కుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు పేర్లు నమోదు చేసుకోండి


రొద్దం: విత్తన వేరుశెనగ కోసం ఆర్‌బికెలలో రైతుల పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఏఓ నివేదిత శుక్రవారం తెలిపారు. కావున రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకొచ్చి సంబంధిత ఆర్‌బికెలో సంప్రదించాలని సూచించారు. 30 కిలోల బస్తా ధర రూ. 1,674గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆమెతో పాటు ఏఈఓ అంజాద్ ఉన్నారు.

తిప్పమ్మ మృతికి రఘువీరా, ఈరన్న నివాళి

మడకశిర రూరల్: మడకశిర మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో శుక్రవారం డిప్యూటీ ఎమ్మార్వో రంగధామ భార్య తిప్పమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తిప్పమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కొండూరులో శాంతి కమిటీ సమావేశం

లేపాక్షి : మండల పరిధిలోని కొండూరు గ్రామంలో శుక్రవారం ఎస్ఐ మునీర్ అహమ్మద్ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హిందూపురం రూరల్ సిఐ వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలన్నారు. అన్ని కులాలు, మతాల ప్రజలు కలిసి మెలసి సోదర భావంతో మెలగాలి అన్నారు. ఎవరైనా ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్న సిఐ వేణుగోపాల్, ఎస్ఐ మునీర్

గ్రంథాలయాల పరిశీలన

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ సందర్శించారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించి లోటుపాట్లను తెలుసుకుని, శిబిరాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి కె.మహబూబ్‌బాషా, రిసోర్స్‌పర్సన్ దాదాపీరా ఉన్నారు.

సోమందేపల్లి : స్థానిక గ్రంథాలయాన్ని శుక్రవారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి పి.రమ సందర్శించి సమ్మర్ క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయానికి రావటం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానంతో పాటు సజనాత్మకత పెంపొందుతుందని తెలిపారు. ఆమె వెంట గ్రంథాలయ అధికారి మహబూబ్ బాషా ఉన్నారు.


సోమందేపల్లిలో గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కార్యదర్శి రమ


పెనుకొండలో గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కార్యదర్శి రమ

రొద్దం: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె శిబిరంలో లోటుపాట్లను తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు గ్రంథాలయ అధికారి నాగరాజు, రీసోర్స్ ఉపాధ్యాయులు మారుతి ఉన్నారు.

అమరాపురం: ప్రస్తుతం మారుతున్న సమాజంలో విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికి తీయడానికి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని గ్రంథాలయ కన్సల్టెంట్ మారుతి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం కథలు, పాఠ్య పుస్తకాలు, దిన పత్రికలు తదితర వాటిని అందుబాటులో ఉంచామన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు పి. నరసింహామూర్తిఉన్నారు.

'డెంగీ' నివారణపై అవగాహన

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మడకశిర మండల పరిధిలోని రేకులగుంట, పెద్దపల్లి గ్రామాల్లో శుక్రవారం జాతీయ గీతిక జనతా వ్యాధుల నియంత్రణలో భాగంగా దోమల నివారణపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గునియా, మెదడువాపు, బోధకాలు, తదితర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే దోమలు వ్యక్తి చేయు వ్యాధులు, జీవిత చరిత్ర, దోమల వ్యక్తిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆర్.అనంతపురం పంచాయతీ కార్యదర్శి లలిత, ఏఎన్ఎం రాధమ్మ, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


డెంగీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-లేపాక్షి

రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయాలని శ్రీసత్యసాయి జిల్లా రైతు సంఘం నాయకులు చలపతి, జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరెడ్డి కోరారు. వారు శుక్రవారం మండలం పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. అందులో ఉంచిన విత్తన వేరుశనగ ప్యాకెట్లను పరిశీలించిన నాణ్యతలేని సరుకుగా గుర్తించారు. 30 కిలోల ప్యాకెట్లు ఒలిస్తే 15 కిలోల శనగ విత్తనాలు ఉన్నాయన్నారు. కావున కలెక్టర్ స్పందించి రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం పతనమయ్యే రోజులు దగ్గర పడ్డాయని ధ్వజమెత్తారు.


రైతు భరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ ప్యాకెట్లను పరిశీలిస్తున్న చలపతి, గోవిందరెడ్డి

నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలి

గోరంట్ల రూరల్ : మండలంలో నిర్వహిస్తున్న నాడు–నేడు పనులను సత్వరమే పూర్తి చేయాలని పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని వివిధ సంక్షేమ పథకాల గురించి సచివాలయ సిబ్బందికి పలు సూచన లు చేశారు. గహ నిర్మాణ శాఖలో ఈకెవైసి, నాడు–నేడు పనులను సత్వరమే పూర్తి చేయాలని మండల అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అలాగే వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మండల అభివృద్ధిపై సమీక్ష

గోరంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 'అభివృద్ధి–సంక్షేమ పథకాలు'పై జిల్లా పంచాయతీరాజ్ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ హౌసింగ్, నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఎస్‌డిజి సర్వే, వివిధ పథకాల లబ్ధిదారులతో ఈకెవైసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రఘునాథ్ గుప్తా, ఇన్‌ఛార్జి ఈఓఆర్‌డి సతీష్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేస్తే ఓర్చుకోలేని ప్రతిపక్షాలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రజలకు ఏదైనా మంచి జరిగితే ప్రతిపక్షాలు ఓర్చుకోలేక పోతున్నాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని శనగలగూడూరు, కొండేపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు అందుతున్న పథకాలపై ఆరాతీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పేదల కోసం పనిచేస్తుంటే టిడిపి జనసేన పార్టీలు మాత్రం పెత్తందారీ పార్టీలుగా మారాయన్నారు. ధనిక వర్గాల కోసం అవి పనిచేస్తున్నాయని విమర్శించారు. అందుకనే పేద ప్రజలకు జగనన్న ఏం చేద్దామని అన్నా కోర్టులకి వెళుతున్నారని విమర్శించారు. ఇప్పుడు న్యాయం మనవైపు ఉంది కాబట్టే, సుప్రీంకోర్టు జగనన్నకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఇంక దుష్టచతుష్టయం ఆటలు చెల్లవన్నారు. పేదల కోసం పనిచేసే జగనన్నకు మంచిరోజులు వచ్చాయన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరూ మేమెంతో ఆనందంగా ఉన్నామని గుండెల మీద చేయి వేసుకుని చెబుతున్నారని అన్నారు. పిల్లల్ని చదివించుకునే తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని తెలిపారు. చంద్రబాబు హయాంలో సంపాదించినదంతా స్కూల్ ఫీజులు కట్టడానికే సరిపోయేవని, ఇప్పుడా పరిస్థితుల్లో మార్పు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, సింగిల్‌విండో ప్రెసిడెంట్, ఎంపీటీసీలు,సర్పంచులు మండల కన్వీనర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి